సాక్షి
ఖమ్మం
గురువారం । 27 । మార్చి । 2025


పేకమేడలా కుప్పకూలిన జీ ప్లస్ 5 భవనం

భద్రాచలంలో స్లాబ్ వేసి ఉన్న ఐదంతస్తుల భవనం బుధవారం మధ్యాహ్నం పేకమేడలా కుప్పకూలింది. ఈ ఘటనలో శిథిలాల కింద ఇద్దరు కూలీలు చిక్కుకున్నట్లు యంత్రాంగం గుర్తించింది. వీరి ఆచూకీ కోసం జిల్లా, రాష్ట్ర, కేంద్ర సహాయక బృందాలు అలుపెరగక శ్రమిస్తున్నాయి. భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు పర్యవేక్షణలో అర్ధరాత్రి వరకు సహాయక చర్యలు కొనసాగుతుండగా ఇంకా ఫలితం కానరాలేదు. – సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

ఇద్దరి కోసం అందరూ..

భద్రాచలంలో కుప్పకూలిన ఐదంతస్తుల భవనం

- శిథిలాల కింద చిక్కుకున్న ఇద్దరు కూలీలు
- సహాయక చర్యల్లో కామేశ్వరరావు ఆచూకీ లభ్యం
- అర్ధరాత్రి వరకు ముమ్మరంగా సాగుతున్న రెస్క్యూ ఆపరేషన్
- రంగంలోకి ఎస్డీఆర్ఎఫ్, సింగరేణి, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు
- సహాయక చర్యల పర్యవేక్షణలో కలెక్టర్, ఎస్పీ

విఫలమైన తొలి ప్రయత్నం (సాయంత్రం 5-45 నుంచి 6-10 గంటల వరకు)

జీ ప్లస్ 5గా నిర్మిస్తున్న భవనం మధ్యాహ్నం 2-45 గంటలకు ఒక్కసారిగా కుప్ప కూలింది. సరిగ్గా ఒక ఫ్లోర్‌పై మరో ఫ్లోర్ స్లాబ్ పడడంతో ఐదో ఫ్లోర్ తప్ప మిగిలిన అన్ని ఫ్లోర్ల స్లాబ్‌లు ఒక దానితో ఒకటి అతుక్కుపోయాయి. ఆ సమయాన గ్రౌండ్ ఫ్లోర్‌లో కూలీలు కామేశ్వరరావు, ఉపేందర్ పని చేస్తున్నారు. అయితే, పనుల్లో ఆరుగురు ఉన్నారని, నలుగురు భోజనానికి వెళ్లిన సమయంలో ప్రమాదం జరిగిందని తొలుత ప్రచారం జరిగినా ఎలాంటి స్పష్టత రాలేదు. ఇక సహాయక చర్యల్లో భాగంగా తెప్పించిన జేసీబీలు, క్రేన్ల సాయంతో ఐదు నుంచి ఆరు వేల టన్నుల బరువైన శిథిలాలను ఎలా తొలగించాలి, శిథిలాల కింద చిక్కుకున్న వారిని ఎలా కాపాడాలనే సంశయం ఏర్పడింది. స్వయంగా ప్రమాదస్థలిని పరిశీలించిన కలెక్టర్ పాటిల్ ఓ నిర్ణయానికి వచ్చారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న కనకదుర్గ ఆలయం గర్భగుడి వెనుక భాగాన రంధ్రం చేయడం ద్వారా సహాయక బృందాలను శిథిలాల కిందికి పంపాలని నిర్ణయించారు. దీంతో ఎన్డీఆర్ఎఫ్, సింగరేణి రెస్క్యూ, అగ్నిమాపక శాఖ ఉద్యోగులు రంధ్రం చేసే పని మొదలుపెట్టారు. అలస్యమయ్యే కొద్దీ బాధితుల ప్రాణాలకు ప్రమాదమే కావడంతో మరోసారి కలెక్టర్ రంగంలోకి దిగారు. గర్భగుడి కుడి వైపు గోడకు రంధ్రం చేసి లోపలికి చూడగా ఆ గదికి బయట నుంచి గడియ పెట్టిన విషయం తెలిసింది. దీంతో ఆ ప్రయత్నాలు అక్కడే ఆపేశారు.


శిథిలాల వద్ద పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్ తదితరులు

కామేశ్వరరావు

గాలి వస్తోంది

రెస్క్యూ ఆపరేషన్‌లో భాగంగా ఆక్సిజన్‌ను లోపలికి పంపిన తర్వాత అక్కడున్న వారు గాలి బాగా వస్తుందా కామేశ్వరరావును అడిగితే.. 'బాగానే వస్తుంది, ఓకే' అంటూ సమాధానం ఇచ్చాడు. శిథిలాల కింద చిక్కుకున్నది రమేశ్ అని తొలుత భావించినా ఆ తర్వాత కామేశ్వరరావుగా గుర్తించారు.

అర్ధరాత్రి 1.42గంటలకు



శిథిలాల కింద చిక్కుకుపోయిన కామేశ్వరరావు వద్దకు రెస్క్యూ సిబ్బంది అర్ధరాత్రి 1.30గంటలకు చేరుకున్నారు. ఆ వెంటనే ఆయనకు ఆక్సిజన్ అమర్చి బయటకు తీసుకొచ్చేసరికి 1.42 అయింది. అప్పటికే అంబులెన్స్‌తో సిద్ధంగా ఉన్న వైద్యులు, సిబ్బంది ఆయనను భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. – భద్రాచలం అర్బన్

బాధితుడి గుర్తింపు (సాయంత్రం 6-15నుంచి రాత్రి 6-57గంటల వరకు)


కట్టర్ల సాయంతో బీమ్‌లు తొలగిస్తూ ముందుకు సాగుతున్న రెస్క్యూ టీమ్ సభ్యులు

తొలి ప్రయత్నం విఫలం కావడంతో నేరుగా గ్రౌండ్ ఫ్లోర్‌కి వెళ్లేలా క్రేన్ల సాయంతో శిథిలాలను తొలగిండం మొదలెట్టారు. అడ్డుగా వచ్చిన బీమ్‌లను కట్టర్ల సాయంతో కత్తిరించారు. దీంతో ఫస్ట్ ఫ్లోర్ లోపలి భాగం కొంత మేర కనిపించింది. ఆ ప్రాంతంలో ఒక చిన్న వెలుతురు కనిపించడంతో తీక్షణంగా పరీక్షించగా అది మొబైల్ ఫోన్‌గా తేలింది. ఆ మొబైల్ ఫోన్ లంచ్ బాక్స్ సంచిలో ఉన్నట్టు గుర్తించారు. లోపల ఎవరైనా ఉన్నారా అని రెస్క్యూ టీమ్ సభ్యులు పదే పదే అడగగా శిథిలాల కింద చిక్కుకున్న కామేశ్వరరావు నుంచి బదులు వచ్చింది.

పలకరింపు (రాత్రి 7-17 నుంచి 8-35గంటల వరకు)


విక్టిమ్ లొకేషన్ కెమెరాతో పరిశీలిస్తున్న సిబ్బంది

శిథిలాల కింద బాధితుడు ఎలా ఉన్నాడో తెలుసుకునేందుకు విక్టిమ్ లోకేషన్ కెమెరాను బాధితుడు ఉన్న ప్రదేశానికి పంపారు. వెలుతురుతో పాటు కెమెరాను చూసిన బాధితుడు తన కుడి చేయిని ఊపుతూ బదులిచ్చాడు. ఎడమ చేయి, కాలు భాగం శిథిలాల కింద చిక్కుకున్నట్టుగా రెస్క్యూ టీమ్ సభ్యులు గుర్తించారు. తల, ఇతర ప్రధాన అవయవాలకు ప్రాణాపాయం కలిగించే గాయాలేమీ కాలేదని నిర్ధారించుకున్నారు. ఆ తర్వాత బాధితుడికి ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఆక్సిజన్ సిలిండర్ ద్వారా ప్రాణవాయువు అందించడం మొదలుపెట్టారు.

శిథిలాల కింద మైనింగ్ (రాత్రి 8-50 గంటల నుంచి)


బొరియల్లా తవ్వుతున్న రెస్క్యూ టీమ్..

ఆరు వేల టన్నుల బరువైన కాంక్రీట్ శిథిలాలను తొలగించేందుకు చాలా సమయం పడుతుందని నిపుణులు తెలిపారు. దీంతో శిథిలాల తొలగింపు నిర్ణయాన్ని పక్కన పెట్టి, భవనం కింద నుంచి తవ్వుతూ లోపలికి వెళ్లి గ్రౌండ్ ఫ్లోర్ వరకు చేరాలని నిర్ణయించారు. బొగ్గు గనుల్లో నేలను తవ్వుతూ భూగర్భంలోకి వెళ్లినట్టుగా ఆరువేల టన్నుల బరువైన శిథిలాల కింద నేలను తవ్వడం మొదలెట్టారు. ఇలా తవ్వుకుంటూ(ఎలుక బొరియ చేసినట్టుగా) బాధితుడు కామేశ్వరరావు ఉన్న ప్రదేశం కిందకు చేరుకోవాలని, ఆ తర్వాత బాధితుడికి ఇబ్బంది లేకుండా పైన ఉన్న బరువులు పడకుండా రక్షించాలని నిర్ణయించారు. మరోవైపు శిథిలాల కింద చిక్కుకున్న ఇంకో బాధితుడు ఉపేందర్ ఉనికిని గుర్తించే ప్రయత్నం కూడా చేస్తున్నారు.

వందల మంది

సింగరేణి రెస్క్యూ, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ ఉద్యోగులకు తోడుగా విజయవాడ నుంచి 30మంది సభ్యులతో కూడిన రెండు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రాత్రి 10గంటల సమయాన భద్రాచలం చేరుకున్నాయి. ఎన్డీఆర్ఎఫ్ డిప్యూటీ కమిషనర్ సుకుందర్, సీఐ పింటూ నంది ఈ బృందాలకు నేతృత్వం వహిస్తున్నారు. తలకు హెల్మెట్లతో టీమ్ సభ్యులు డ్రిల్లింగ్ మిషన్లు, కట్టర్లు, స్ప్రెడర్లు, హైడ్రాలిక్ లిఫ్టులు ఉపయోగిస్తూ ఆపరేషన్‌లో పాల్గొంటున్నారు. కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్ రాజు, ఏఎస్పీ విక్రాంత్‌సింగ్, ఆర్డీఓ దామోదర్ రావు, గ్రామపంచాయతీ ఈఓ శ్రీనివాసరావు అర్ధరాత్రి వరకు అక్కడే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు.


ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందికి భవన ప్లాన్‌ను వివరిస్తున్న కలెక్టర్

యాక్షన్ మోడ్‌లో కలెక్టర్..

భద్రాచలం: భవనం కుప్పకూలిన సమాచారం తెలుసుకున్న భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి.పాటిల్ హుటాహుటిన 4-40 గంటలకు ఘటనాస్థలానికి చేరుకున్నారు. అప్పటివరకు నెమ్మదిగా సాగిన సహాయక చర్యల్లో వేగం పెంచేలా అందరినీ అప్రమత్తం చేశారు. భవనం నలువైపులా పరిశీలించి ఎటు నుంచి లోనికి వెళ్లే అవకాశం ఉందని చూశారు. లైట్లు వేసి శిథిలాల కింద ఎవరైనా ఉన్నారా అంటూ కేకలు వేశారు. శిథిలాలపైకి చేరుకుని తాడు సాయంతో లోనికి వెళ్లొచ్చా అంటూ సింగరేణి, ఫైర్ అధికా రులతో చర్చించారు. ఆ అవకాశం లేకపోవడంతో అమ్మవారి ఆలయానికి వెనుక భాగాన రంధ్రం చేసి గ్రౌండ్ ఫ్లోర్‌కు వెళ్లేందుకు ప్రయత్నించారు. అక్కడా అవకాశం లేకపోగా జేసీబీలు, క్రేన్ల సాయంతో ఒక్కో ఫ్లోర్ శిథిలాలను తొలగిస్తూ లోపలకి వెళ్లాలని సిబ్బందిని ఆదేశించారు. అంతేకాక బాధితులకు ఆక్సిజన్ పంపేలా ఏర్పాట్లు చేయించారు. ఆతర్వాత విజయవాడ నుంచి చేరిన ఎన్డీఆర్ఎఫ్ బృందాలకు భవన ప్లాన్‌ను వివరించి, అప్పటివరకు చేపట్టిన సహాయక చర్యలు, లోనకు వెళ్లే ఉన్న మార్గాలను తెలిపారు.

ఆది నుంచీ అనుమానాస్పదమే


ఆదివాసీ సంఘాల నాయకులతో శ్రీపతి వాగ్వాదం (ఫైల్)

భద్రాచలం: భద్రాచలానికి శ్రీనివాసం శ్రీరామ స్వాతి – శ్రీపతి దంపతులు పదేళ్ల క్రితం వచ్చారు. అప్పటి నుంచి పలు ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శ్రీపతి తెలుపు, కాషాయ వస్త్రాలు ధరించి, గుబురు గడ్డంతో స్వామిజీలా కనిపించేవారు. ఆ తర్వాత పాత భవనాన్ని కొనుగోలు చేసి అక్కడే ఆలయ నిర్మాణం ప్రారంభించారు. అది పూర్తికాకముందే జీ ప్లస్ 5 భవన నిర్మాణం మొదలుపెట్టారు. ఆధ్యాత్మిక ముసుగులో అక్రమ కట్టడాలేమిటని ప్రశ్నించిన స్థానికులతో పలుమార్లు తగదా పడ్డారు. భవన నిర్మాణ పనులపై అభ్యంతరం వ్యక్తం చేసిన గిరిజన సంఘాల నేతలతోనూ గొడవ పెట్టుకున్నారు. భవనం కూలిపోయిన తర్వాత ఈ దంపతుల విషయమై స్థానికులను వాకబు చేయగా ఎవరూ పూర్తి వివరాలు చెప్పలేకపోయారు. అయితే, శ్రీపతిని బుధవారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తున్నా స్పష్టత రాలేదు.

అంతా క్షణాల్లోనే...

కుప్పకూలిన భవనం చుట్టుపక్కల నివాసాల్లోని వారిని పలకరించగా.. స్లాబ్‌లు కూలుతున్న సమయాన ఓ మాదిరి శబ్దం వచ్చిందని తెలిపారు. అదేమిటో చూడడానికి బయటకు రాగా ఒక్కసారిగా దుమ్ము కమ్మేసిందని వెల్లడించారు. దుమ్ము నుంచి తేరుకున్నాక పరిశీలిస్తే కళ్ల ముందు నిలువెత్తు కనిపించే భవనం కుప్పకూలి ఉందని తెలిపారు. అదే స్లాబ్‌లు తమ ఇళ్లపై కూలితే ఏం జరిగేదోనన్న ఆందోళన ఎదురైందని పలువురు చెప్పారు.

విపత్తులు కొత్త కాకున్నా...

ప్రతీ ఏడాది గోదావరి వరదలు వచ్చే భద్రాచలం ఏజెన్సీకి రెస్క్యూ ఆపరేషన్లు కొత్త కాదు. కానీ భవనం కూలిపోయినప్పుడు శిథిలాల కింద చిక్కుకున్న బాధితులను కాపాడడం మాత్రం ఇదే తొలిసారి. దీంతో స్థానికులు వందల సంఖ్యలో ఘటనా స్థలికి చేరుకుని సహాయక కార్యక్రమాలను చూస్తున్నారు.

న్యూస్‌రీల్

డిప్యూటీ సీఎంకు బ్రహ్మోత్సవాల ఆహ్వానం


డిప్యూటీ సీఎంకు చిత్రపటం అందిస్తున్న అధికారులు, అర్చకులు

ఎర్రుపాలెం/ముదిగొండ: ఎర్రుపాలెం మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 30వ తేదీ నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు మొదలుకానున్నాయి. ఈ మేరకు బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని కోరుతూ బుధవారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈసందర్భంగా చిత్రపటం, ప్రసాదాలు అందజేసి ఏర్పాట్లను వివరించారు. ఆలయ ఈఓ కె.జగన్మోహన్‌రావు, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, ఉద్యోగులు వంశీ, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, ముదిగొండ మండలం ముత్తారంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ఏప్రిల్ 6న శ్రీరామనవమి సందర్భంగా జరగనున్న శ్రీ సీతారాముల కల్యాణానికి హాజరుకావాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు హైదరాబాద్‌లో ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈమేరకు ఉత్సవాల పోస్టర్లను డిప్యూటీ సీఎం ఆవిష్కరించగా.. ఆలయ ఈఓ సమత, ప్రధాన అర్చకులు బొర్రా వాసుదేవాచార్యులు, శ్రీనివాసాచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ తుళ్లూరి జీవన్, సభ్యులు తిరపయ్య, వీరభద్రం, బుచ్చయ్య, నాయకులు అజయ్ పాల్గొన్నారు.

వచ్చేనెల 7నుంచి ఎస్సెస్సీ మూల్యాంకనం

ఖమ్మం సహకారనగర్: పదో తరగతి వార్షిక పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం వచ్చే నెల 7వ తేదీ నుంచి ప్రారంభించనున్నారు. ఈమేరకు ఖమ్మంలోని సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో వాల్యుయేషన్ క్యాంప్ ఏర్పాటుకు నిర్ణయించారు. ఇప్పటివరకు పూర్తయిన పరీక్షల జవాబుపత్రాలు వివిధ జిల్లాల నుంచి బుధవారం ఇక్కడకు చేరగా స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపరిచారు.

ప్రశాంతంగా ఎస్సెస్సీ పరీక్షలు

పరిశీలించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్


పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న కలెక్టర్

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ వెల్లడించారు. ఖమ్మం రిక్కాబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రాన్ని బుధవారం పరిశీలించిన ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని, ఎండ తీవ్రత దృష్ట్యా విద్యార్థులకు చల్లని తాగు నీరు సమకూరుస్తున్నామని తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్ కె.శేఖర్‌రావు, డిపార్ట్‌మెంటల్ అధికారి ఎన్.శ్రీనివాసచారి, సిట్టింగ్ స్క్వాడ్ సురేందర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, బుధవారం జరిగిన గణితం పరీక్షకు జిల్లాలో 16,417మంది విద్యార్థులకు గాను 16,388మంది హాజరు కాగా 29మంది గైర్హాజరయ్యారని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు.

సాగుకు నీటి కొరత ఉండదు..


కాల్వ వద్ద పరిశీలిస్తున్న డీఏఓ పుల్లయ్య, తదితరులు

తిరుమలాయపాలెం: జిల్లాలో సాగు అవసరాలకు మరో ఇరవై రోజుల వరకు నీటి కొరత ఉండదని జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య తెలిపారు. మండలంలోని దమ్మాయిగూడెం, ఏలువారిగూడెం, బీరోలు, బచ్చోడు తదితర గ్రామాల్లో బుధవారం ఆయన వరి పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పంటల స్థితిగతులు, నీటి లభ్యతపై ఆరా తీసిన ఆయన నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. తద్వారా వేసవిలో తాగునీటికి ఇబ్బందులు ఉండవని చెప్పారు. కాగా, ఏప్రిల్ 1నుంచి జిల్లాలోని అన్ని మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని తెలిపారు. కూసుమంచి ఏడీఏ బి.సరిత, ఏఓ సీతారాంరెడ్డి, ఏఈఓ లంక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మాయి పుట్టడం.. అదృష్టం

- అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ
- జిల్లాలో 'మా పాప – మా ఇంటి మణిదీపం' ప్రారంభం


కామేపల్లి : ఆడపిల్ల తల్లిదండ్రులను సన్మానించిన అదనపు కలెక్టర్ శ్రీజ, అధికారులు


ఎర్రుపాలెం : చొప్పకట్లపాలెంలో బాలింత, శిశువుతో జెడ్పీ సీఈఓ దీక్ష

కామేపల్లి: ఆడపిల్ల పుట్టడాన్ని అదృష్టంగా భావించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. ఆడపిల్లకు జన్మనిచ్చిన తల్లిదండ్రులను అభినందించేలా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 'మా పాప – మా ఇంటి మణిదీపం' పేరిట ఈ కార్యక్రమం ద్వారా అమ్మాయి పుట్టిన దంపతులను జిల్లా యంత్రాంగం తరఫున సన్మానించడంతో స్వీట్ బాక్స్, ప్రశంసాపత్రం ఇవ్వాలని సూచించారు. ఆడపిల్ల జన్మోత్సవ వేడుకల పేరిట రూపొందించిన ఈ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించగా కామేపల్లి మండలం జాస్తిపల్లిలో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. గ్రామానికి చెందిన శివరాత్రి నాగమణి–సాయిరాం దంపతులకు ఇటీవల ఆడపిల్ల జన్మించగా వారిని సన్మానించి స్వీట్లు అందజేశాక ఆమె మాట్లాడారు. కుటుంబ పరిస్థితులు ఎలా ఉన్న ఆడపిల్లను భారంగా భావించొద్దని, మగపిల్లలతో సమాన అవకాశాలు కల్పించాలని సూచించారు. మండల ప్రత్యేకాధికారి మధుసూదన్‌రావు, తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీఓ రవీందర్, ఐసీడీఎస్ సీడీపీఓ దయామణి, సూపర్‌వైజర్ కృష్ణకుమారి పాల్గొన్నారు.

■ కారేపల్లి: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తూ వారికి క్రమశిక్షణ నేర్పాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని అదనపు కలెక్టర్ శ్రీజ అన్నారు. కారేపల్లి మండలం రేలకాయలపల్లి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన ఆమె తరగతి గదులు, వంటశాలను పరిశీలించి సౌకర్యాలపై విద్యార్థులతో మాట్లాడారు. పలువురు విద్యార్థుల దుస్తులు, కటింగ్, వ్యక్తిగత పరిశుభ్రతపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేస్తూ హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, వార్డెన్లను మందలించారు. ఎంపీఓ రవీంద్రప్రసాద్ పాల్గొన్నారు.

■ ఎర్రుపాలెం: మండలంలోని చొప్పకట్లపాలెం, బనిగండ్లపాడు, ఎర్రుపాలెంల్లో జెడ్పీ సీఈఓ దీక్షారైనా పర్యటించారు. చొప్పకట్లపాలెంలో ఆడపిల్లకు జన్మనిచ్చిన తల్లిదండ్రులను సన్మానించి మాట్లాడారు. ఆతర్వాత బనిగండ్లపాడు పీహెచ్‌సీని తనిఖీ చేయగా, మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్, గురుకులంలో పదో తరగతి పరీక్ష కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఐసీడీఎస్ సీడీపీఓ కృష్ణశ్రీ, ఎంపీడీఓ సురేందర్, ఎంఈఓ బి.మురళీమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ఖజానా శాఖలో ప్రక్షాళన ప్రారంభం

ముగ్గురి ఉద్యోగుల డిప్యూటేషన్లు రద్దు

ఖమ్మం సహకారనగర్: జిల్లా ఖజానా శాఖ కార్యాలయం ఉద్యోగుల తీరుపై వరుస విమర్శలు వస్తుండడంతో ఉన్నతాధికారులు దృష్టి సారించారు. ఇటీవల ఈ అంశంపై కలెక్టర్ కూడా స్వయంగా సమీక్షించారు. దీంతో ఖజానా శాఖ డైరెక్టర్ కేఎస్‌ఆర్‌సీ.మూర్తి ఆదేశాలతో డిప్యూటీ డైరెక్టర్ ఎస్‌వీఎస్.నర్సింహం చర్యలకు ఉపక్రమించారు. ఇందులో భాగంగా మంగళవారం రాత్రి ముగ్గురు ఉద్యోగుల డిప్యూటేషన్లను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈమేరకు డిప్యూటేషన్‌పై ఉన్న కొనసాగుతున్న సీనియర్ అకౌంటెంట్లు రవీంద్రబాబును వైరాకు, సంధ్యారాణిని మధిరకు, జూనియర్ అకౌంటెంట్ శోభారాణిని నేలకొండపల్లిలో యథాస్థానాలకు వెళ్లాలని ఆదేశించారు. అయితే, ఉద్యోగుల డిప్యూటేషన్ల రద్దుతో ఖజానా శాఖలో నెలకొన్న సమస్యలకు పరిష్కారం లభిస్తుందా, లేదా అన్నది వేచి చూడాల్సిందే.

టీజేఏసీ జిల్లా చైర్మన్‌గా శ్రీనివాసరావు


శ్రీనివాసరావు, చైర్మన్


సత్యనారాయణ, కోకన్వీనర్

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ(టీజేఏసీ) జిల్లా కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. ఖమ్మంలోని టీఎన్జీవోస్ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నిక ఏకగ్రీవమైంది. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్‌గా గుంటుపల్లి శ్రీనివాసరావు, కోకన్వీనర్‌గా టీజీవోస్ జిల్లా అధ్యక్షుడు కస్తాల సత్యనారాయణ ఎన్నికయ్యారు. అలాగే, కోచైర్మన్లుగా పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు, యూటీఎఫ్ కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తుంబూరు సునీల్‌రెడ్డి, పీఆర్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎం.రాజేష్‌తో పాటు కొణిదన శ్రీనివాస్, మల్లెల రవీంద్రప్రసాద్, చంద్రకంటి శశిధర్, చర్ల శ్రీనివాసరావు, బాబురత్నాకర్, పుల్లయ్య, వరప్రసాద్, సైదులు, బిక్కును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్, కోకన్వీనర్ మాట్లాడుతూ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఏప్రిల్ 1నుంచి ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు సమర్పించడంతో పాటు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జేఏసీ ఆధ్వర్యాన చేపట్టే కార్యక్రమాలకు అన్నివిభాగాల ఉద్యోగులు మద్దతు ఇవ్వాలని కోరారు.

క్లుప్తంగా

ములుగు జిల్లా మత్స్యకారులకు శిక్షణ

కూసుమంచి: మండలంలోని పాలేరు పీ.వీ.నరిసింహారావు మత్స్య పరిశోధనా కేంద్రంలో ములుగు జిల్లాకు చెందిన షెడ్యూల్డ్ తెగల మత్స్యకారుల మూడో బ్యాచ్ శిక్షణ బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్యాంప్రసాద్ చేపల పెంపకంలో పద్ధతులు, సంరక్షణపై అవగాహన కల్పించారు. మత్స్యకారులు మూడు రోజుల పాటు కొనసాగే శిక్షణను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా ఎదగాలని సూచించారు. అనంతరం క్షేత్రస్థాయి సందర్శనలో భాగంగా ఫిషరీస్ కేంద్రాలను సందర్శించి వివిధ రకాల చేపలు, రొయ్యల పెంపకం, వ్యాధుల నివారణ, దాణా తయారీ విధానాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

చేగొమ్మ నర్సరీలో 3న మామిడికాయల వేలం

కూసుమంచి: మండలంలోని చేగొమ్మ ప్రభుత్వ ఉద్యాన నర్సరీలో 500 చెట్ల మామిడి కాయల విక్రయానికి వచ్చేనెల 3వ తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఉద్యానవన శాఖ అధికారి అపర్ణ తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.5వేల నగదు డిపాజిట్ చెల్లించాలని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు వివరాల కోసం 89777 14104 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

'పాలకుల తీరుతోనే రైతుల ఆత్మహత్యలు'

ఖమ్మంమయూరిసెంటర్: పాలకుల విధానాల ఫలితంగానే రైతుల ఆత్మహత్యలు జరుగుతున్నాయని రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాదిరాజు రమేష్ పేర్కొన్నారు. ఖమ్మంలోని బోడేపూడి విజ్ఞానకేంద్రంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి వెన్నెముక అయిన రైతులు ఇప్పుడు దివాలా స్థితికి చేరారని.. కేంద్ర, రాష్ట్ర పాలకులు సరైన సహకారం అందించకపోవడంతోనే ఈ పరిస్థితి ఎదురవుతుందని చెప్పారు. సరళీకృత విధానాల్లో భాగంగా వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించడమే కాక సబ్సిడీలు తగ్గించారని, కనీస మద్దతు ధర ప్రకటించడం లేదని తెలిపారు. ఇకనైనా స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలుచేసి ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు వై.శ్రీనివాసరావు, ఎం.సుబ్బారావు, ఎస్.కే.అఫ్జల్‌మియా, జి.రామారావు, వాసిరెడ్డి వీరభద్రం, టి.వెంకట్రావు, నెల్లూరు వీరబాబు, టి.శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌తో జిల్లా నేతల భేటీ



మీనాక్షి నటరాజన్‌తో నాయకులు

ఖమ్మంవన్‌టౌన్: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌తో బుధవారం జిల్లా, ఖమ్మం నగర నాయకులు ఢిల్లీలో భేటీ అయ్యారు. అక్కడి యువజన కాంగ్రెస్ కార్యాలయంలో ఆమెను కలిసిన వారు నామినేటెడ్ పదవుల్లో పార్టీ కోసం ఏళ్లుగా కష్టపడుతున్న వారికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహ్మద్ జావీద్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో శిక్షణకు డైట్ ప్రిన్సిపాల్

ఖమ్మంసహకారనగర్: ఢిల్లీలో నీతి ఆయోగ్ ద్వారా ఏర్పాటు చేసిన వర్క్‌షాపు, శిక్షణకు రాష్ట్రంలోని ముగ్గురు డైట్ కళాశాలల ప్రిన్సిపాళ్లను ఆహ్వానించారు. ఇందులో ఖమ్మం డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సామినేని సత్యనారాయణకు అవకాశం దక్కింది. ఈ సందర్భంగా బుధవారం ఆయన ఢిల్లీలో 'నేషనల్ వర్క్‌షాపు ఆన్ టీచర్ ఎడ్యుకేషన్'అనే అంశంపై జరిగిన శిక్షణకు హాజరయ్యారు.

నిలిచిన డిజిటల్ పేమెంట్లు

ఖమ్మంగాంధీచౌక్: ప్రస్తుతం నగదు చెల్లింపులకు అందరూ డిజిటల్ విధానాన్ని ఉపయోగించుకుంటుండగా.. బుధవారం మధ్యాహ్నం నుంచి రాత్రి ఆ సేవలు నిలిచిపోయాయి. సర్వర్ పని చేయకపోవడంతో ఈ పరిస్థితి ఎదురైనట్లు తెలుస్తోంది. దీంతో ఫోన్ పే, గుగుల్ పే వంటి యాప్‌లు పనిచేయక ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లోనే కాక వినియోగదారులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. రీచార్జ్, బిల్లుల చెల్లింపు వంటివి నిలిచిపోయాయి. అయితే, రాత్రి 9 గంటల సమయాన సేవలు తిరిగి అందుబాటులోకి వచ్చాయని బ్యాంకుల ప్రతినిధులు తెలిపారు.

కేసు నమోదు

ఖమ్మంరూరల్: మండలంలోని జలగంనగర్‌కు చెందిన షేక్ బషీర్‌పై అదే గ్రామానికి చెందిన ముగ్గురు దాడి చేయగా హత్యాయత్నం కేసు నమోదైంది. గ్రామానికి చెందిన బషీర్ కుమారుడైన హుస్సేన్ స్థానిక మసీదు నిర్వహణపై తరచుగా ప్రశ్నిస్తున్నాడు. దీనిని మనసులో పెట్టుకుని ఈనెల 23న హుస్సేన్‌ను స్థానికుడైన షేక్ మోసీన్‌ఖాన్ కొట్టాడు. అంతేకాక బషీర్, హుస్సేన్ ఈ నెల 25న నమాజ్‌కు వెళ్తుండగా మోసీన్‌ఖాన్, ఇమ్రాన్, రిజ్వాన్ దాడి చేయగా బషీర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ముగ్గురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు సీఐ ముష్క రాజు తెలిపారు.

ఆ'పన్ను'హస్తం లేక..

- గ్రంథాలయ పన్నుల చెల్లింపుల్లో నిర్లక్ష్యం
- ప్రభుత్వ సంస్థల నుంచి రూ.10 కోట్ల మేర బకాయిలు
- ఫలితంగా అభివృద్ధికి నోచుకోని విజ్ఞాన బాండాగారాలు



జిల్లా కేంద్ర గ్రంథాలయం (ఇన్‌సెట్) గ్రంథాలయంలో పోటీ పరీక్షల కోసం సన్నద్ధమవుతున్న నిరుద్యోగులు

ఖమ్మంగాంధీచౌక్: ప్రజలు పన్నులు చెల్లిస్తున్నా.. ఆ పన్నుల్లో గ్రంథాలయాల వాటా జమ చేయడంలో ప్రభుత్వ శాఖలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. దీంతో విజ్ఞాన బాండాగారాలుగా, నిరుద్యోగ యువతీ, యువకులకు అండగా నిలిచే గ్రంథాలయాల అభివృద్ధి కుంటుపడుతోంది. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు వసూలు చేసే పన్నుల్లో 8 శాతం గ్రంథాలయాల వాటాగా జమ చేయాలి. ఈ నిధులను ఎప్పటికప్పుడు చెల్లించాల్సి ఉన్నా అలా జరగడం లేదు. దీంతో ఏళ్లుగా రూ.కోట్లలో బకాయిలు పేరుకుపోయాయి.

2017–18 ఆర్థిక సంవత్సరం నుంచి..

గ్రంథాలయాలకు ప్రభుత్వ సంస్థల నుంచి దాదాపు రూ.10 కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయి. 2017–18 ఆర్థిక సంవత్సరం నుంచి ప్రభుత్వ సంస్థల నుంచి పెద్ద ఎత్తున పన్ను బకాయిలు పేరుకుపోయాయి. జిల్లాలోని గ్రామ పంచాయతీల ద్వారా వసూలైన పన్నుల నుంచి రావల్సిన బకాయి రూ.3 కోట్లు జిల్లా పంచాయతీ శాఖ చెల్లించాల్సి ఉంది. ఖమ్మం కార్పొరేషన్ నుంచి దాదాపు రూ.5 కోట్లు, సత్తుపల్లి, వైరా, మధిర మున్సిపాలిటీల నుంచి దాదాపు రూ.2 కోట్ల మేర బకాయిలు ఉన్నాయి. ప్రభుత్వ సంస్థల అధికార యంత్రాంగం గ్రంథాలయాల పన్ను వాటా చెల్లించేందుకు సుముఖంగా ఉన్నప్పటికీ ఆయా సంస్థల పాలకవర్గాలు మోకాలడ్డుతున్నాయి. ఇటీవల ఖమ్మం కార్పొరేషన్ నుంచి రూ.2 కోట్ల మేరకు గ్రంథాలయ సంస్థకు చెల్లించేందుకు ఓ ఉన్నతాధికారి ప్రయత్నించినా పాలకవర్గం తిరస్కరించినట్లు సమాచారం. వైరా మున్సిపాలిటీ మాత్రం బకాయిల్లో రూ.10 లక్షలు చెల్లించింది. ఇక సత్తుపల్లి, మధిర మున్సిపాలిటీల నుంచి కూడా బకాయిలు రావాల్సి ఉంది. జిల్లా గ్రంథాలయ సంస్థకు ప్రస్తుతం కమిటీ లేకపోవటంతో అదనపు కలెక్టర్ శ్రీజ పర్సన్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తూ బకాయిల వసూళ్లపై దృష్టి సారించారు. బకాయి ఉన్న ప్రభుత్వ సంస్థలను గ్రంథాలయానికి చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని నోటీసులు ఇచ్చినట్లు సమాచారం.

నిధులు లేక..

గ్రంథాలయాలకు స్థానిక సంస్థల నుంచి పన్నుల రూపంలో నిధులు సమకూరుతాయి. ఆ నిధుల చెల్లింపు లేకపోవటంతో జిల్లాలో గ్రంథాలయాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. జిల్లాలో జిల్లా కేంద్ర గ్రంథాలయం, 22 శాఖా గ్రంథాలయాలు, రెండు గ్రామ గ్రంథాలయాలు నిర్వహణలో ఉన్నాయి. జిల్లా కేంద్ర గ్రంథాలయం పాత భవనం శిథిలమై 2024 జనవరి 13న కూలిపోయింది. దీంతో జిల్లా గ్రంథాలయ సంస్థకు కార్యాలయ, పరిపాలన భవనమే లేకుండా పోయింది. తాత్కాలికంగా ఖమ్మం పాత మున్సిపాలిటీ భవనంలో నిర్వహిస్తున్నారు. ఇక నేలకొండపల్లిలో నూతన భవన నిర్మాణం నత్తనడకన సాగుతోంది. ఇక ఎక్కడా కూడా గ్రంథాలయాల అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహణలో లేవు. పుస్తకాల సమస్య తీవ్రంగా ఉంది. పోటీ పరీక్షలకు సంబంధించి తాజా పుస్తకాలు లేవు. నిరుద్యోగులు, విద్యార్థులు వివిధ రకాల పుస్తకాలు, పోటీ పరీక్షల పుస్తకాల కోసం గ్రంథాలయాల అధికారులను అభ్యర్థిస్తున్నా వారు సైతం నిధుల కొరతతో ఏమీ చేయలేని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ సంస్థలు బకాయిలు చెల్లిస్తే గ్రంథాలయాల అభివృద్ధికి, నిర్మాణాలకు, పాఠకులు కోరుకునే, నిరుద్యోగులు, విద్యార్థులకు ప్రయోజనం కలిగించే పుస్తకాలను అందుబాటులో ఉంచే అవకాశం ఉంటుంది. ఈ విషయమై అధికారులను ఆరా తీయగా.. పన్ను బకాయిలు రావాల్సి ఉందని, అవి జమఅయితే సంస్థ అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు.

ఉన్నత స్థాయికి చేరడమే లక్ష్యం కావాలి..

- మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడమే కీలకం
- ఆడపిల్ల గర్వకారణమని చెప్పడానికే ప్రత్యేక కార్యక్రమం
- తనికెళ్ల మహిళా డిగ్రీ కళాశాల జాబ్‌మేళాలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



కొణిజర్ల : జాబ్‌మేళాలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పక్కన అధికారులు

కొణిజర్ల: ఎంచుకున్న రంగంలో ఉన్నత స్థాయికి చేరుకోవడమే లక్ష్యంగా అభ్యర్థులు శ్రమించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. మండలంలోని తనికెళ్లలోని గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యాన బుధవారం జాబ్‌మేళా నిర్వహించగా.. కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా బలోపేతంగా లేకపోవడమే వివక్షకు కారణమని గుర్తించిన ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకాన్ని ప్రారంభించిందన్నారు. ఆడపిల్ల పుట్టడం అదృష్టమని చాటేందుకు జిల్లాలో 'మా పాప – మా ఇంటి మణిదీపం' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. కాగా, ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో చదివే బాలికలు బాధ్యతగా వ్యవహరించాలని, అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత స్థాయికి చేరాలన్నారు. కాగా, తాను ఈ స్థాయికి చేరడానికి అమ్మమ్మ కారణం కాగా.. తన భార్య కూడా ఢిల్లీలో ఉన్నతస్థాయి ఉద్యోగం చేస్తోందని తెలిపారు. ఎన్నికల సమయాన మహిళా అధికారులకు విధులు అప్పగిస్తే రూ.4 కోట్ల విలువైన నగదు, మద్యం, బంగారం జప్తు చేశారని గుర్తు చేశారు. తొలుత కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ గురుకుల నిర్వహణ, అభివృద్ధి పనులపై ప్రిన్సిపాల్‌తో చర్చించడమే కాక జాబ్‌మేళాకు వచ్చిన కంపెనీలు, ఉపాధి అవకాశాలపై ఆరా తీశారు. కాగా, జాబ్‌మేళాలో 15 కంపెనీల బాధ్యులు ఇంటర్వ్యూలు నిర్వహించగా 431 మంది ఎంపికయ్యారు. జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి ఎస్.మాధవి, ప్రిన్సిపాల్ డాక్టర్ రజిత, వైస్ ప్రిన్సిపాల్ ఎం.నవ్య, వివిధ కంపెనీల ప్రతినిధులు, కోఆర్డినేటర్లు ఐశ్వర్య, రాణి, కె.రజిని, రాజేశ్వరి పాల్గొన్నారు.

మహిళా మార్ట్ ప్రత్యేకంగా ఉండాలి..

ఖమ్మంమయూరిసెంటర్: సాధారణ మాల్స్ మాదిరి కాకుండా మహిళా మార్ట్‌ను ప్రత్యేకంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. ఖమ్మంలోని సీక్వెల్ రోడ్డులో ఏర్పాటవుతున్న మహిళా మార్ట్ పనులను అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజతో కలిసి ఆయన పరిశీలించి సూచనలు చేశారు. ఈ మార్ట్‌లో స్వశక్తి మహిళా సంఘాల సభ్యులు తయారుచేసే వస్తువులను విక్రయించనుండగా.. వాటి తయారీ, మహిళా సంఘం సభ్యుల వివరాలతో డాక్యుమెంటరీ ప్రదర్శించాలని తెలిపారు. అలాగే, జిల్లా ఖ్యాతిని చాటేలా లోగో రూపొందించాలని చెప్పారు. డీఆర్‌డీఓ సన్యాసయ్య, అడిషనల్ డీఆర్‌డీఓ నూరుద్దీన్, పీఆర్ ఈఈ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్‌పై దృష్టి

ఖమ్మంగాంధీచౌక్: వివిధ మండలాల్లో పైలట్‌గా ఎంపిక చేసిన గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు మొదలయ్యేలా దృష్టి సారించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ, డీఆర్‌ఓ పద్మశ్రీ, జెడ్పీసీఈఓ దీక్షరైనా, డీఆర్‌డీఓ సన్యాసయ్య, హౌసింగ్, పీఆర్ ఈఈలు బి.శ్రీనివాస్, వెంకటరెడ్డి, డీపీఓ ఆశాలతతో కలిసి పలు అంశాలపై సమీక్షించారు. పైలట్ గ్రామాల్లో 850 ఇళ్లు మంజూరు చేయగా.. పెట్టుబడి లేని వారి కుటుంబాల్లో మహిళలు స్వయం సహాయక సభ్యులుగా ఉండడంతో 369 మందికి రుణం అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. వారికి త్వరగా రుణం మంజూరు చేసి ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరిగేలా చూడాలని చెప్పారు. అలాగే, మోడల్ ఇళ్ల నిర్మాణం ఆరు చోట్ల పురోగతిలో లేనందున రెండు వారాల గడువు ఇవ్వాలని, అయినా పని కాకపోతే కాంట్రాక్టర్‌ను మార్చాలని సూచించారు.

విద్యార్థులకు చేయూత అభినందనీయం



విద్యార్థులతో జిల్లా జడ్జి, ఫౌండేషన్ ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: పేద విద్యార్థులు చదువుకు ఇబ్బంది పడకుండా అండగా నిలవడం అభినందనీయమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ తెలిపారు. ఖమ్మం గుట్టలబజార్‌లోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కాళ్ల ఫౌండేషన్ ఆధ్వర్యాన పలువురు విద్యార్థుల చదువుకు అవసరమైన రూ.2.50 లక్షలను చెక్కుల రూపంలో అందజేశారు. జిల్లా జడ్జి మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు చేతనైనంత మేర ఇతరులకు సాయం చేయాలని సూచించారు. కాళ్ల ఫౌండేషన్ చైర్మన్ కాళ్ల పాపారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మేళ్లచెరువు వెంకటేశ్వరరావు, చిన్ని కృష్ణారావు, కల్వకుంట్ల గోపాల్‌రావు, తేరాల ప్రవీణ్‌కుమార్, భాస్కర్‌రావు, కృష్ణమోహన్, శ్రీనివాసరావు, బద్రినారాయణ, భగీరథ్, మాధవ్, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదవాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఈఓ సోమశేఖరశర్మ

ఎర్రుపాలెం: చిన్నతనం నుంచే విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని కష్టపడి చదివితే ఉన్నత స్థానాలకు చేరొచ్చని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. ఎర్రుపాలెంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని బుధవారం తనిఖీ చేసిన ఆయన పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఇప్పటివరకు పరీక్షలు ఎలా రాశారని ఆరా తీసిన ఆయన చదువులో రాణిస్తున్న ఆడపిల్లలు మరింత శ్రద్ధ వహించాలని సూచించారు. ఆ తర్వాత పాఠశాల రికార్డులను పరిశీలించిన డీఈఓ, మెనూ అమలు, మరమ్మతుల వివరాలు తెలుసుకున్నారు. సూపరింటెండెంట్ కె.సరిత, ఎంఈఓ బి మురళీమోహన్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గొలుసు చోరీ కేసుల్లో ఒకరి అరెస్ట్

కల్లూరురూరల్: వివిధ ప్రాంతాల్లో బంగారు గొలుసుల చోరీకి పాల్పడుతున్న నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఏసీపీ రఘు తెలిపారు. బుధవారం కల్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. కల్లూరులో బుధవారం ఉదయం చేపట్టిన తనిఖీల్లో పట్టుబడిన మూడ్ రమేశ్‌ను విచారించగా చోరీల విషయం బయటపడిందన్నారు. ఏలూరు జిల్లా చింతలపూడి మండలం నామవరానికి చెందిన ఆయనతో పాటు గణేశ్ కలిసి పెనుబల్లి మండలంలో భూమి కౌలు తీసుకొని పనిచేస్తున్నట్లు నమ్మించి పరిసర గ్రామాల్లో గొలుసు చోరీలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. గత ఏడాది జూన్ 6న కప్పలబంధం రోడ్డులో నివాసముండే కన్యాదానం నరసింహాచార్యులు, సెప్టెంబర్ 17న బైక్‌పై వెళ్తున్న భార్యాభర్తల నుంచి, ఈ నెల 17న కల్లూరు మండలం కొర్లగూడెంలో ఒక మహిళ నుంచి గొలుసులు చోరీ చేశారని తెలిపారు. అలాగే, సత్తుపల్లి మండలం యాతాలకుంటలోనూ చోరీకి పాల్పడ్డారని పేర్కొన్నారు. కాగా, నిందితుల్లో గణేశ్‌పై 14 కేసులు ఉండగా, కొర్లగూడెం ఘటనలో ఆయన రమేశ్‌తో ఉన్నాడని వెల్లడించారు. ఈ మేరకు రమేశ్ పట్టుబడగా, పారిపోయిన గణేశ్ కోసం గాలిస్తున్నామని వివరించారు. నిందితుడిని అరెస్ట్ చేసిన ఖమ్మం ఏసీపీ సర్వర్, సత్తుపల్లి రూరల్ సీఐ ముత్తిలింగం, కల్లూరు ఎస్ఐ హరితను ఏసీపీ రఘు అభినందించారు.

నేడు 'నిధి ఆప్‌కే నికట్'

ఖమ్మం సహకారనగర్: ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు ఈనెల 27న 'నిధి ఆప్‌కే నికట్' నిర్వహించనున్నట్లు ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ నాగుల్ తెలిపారు. ఖమ్మం జిల్లాకు సంబంధించి ఖమ్మం ఎస్‌బీఐటీ కళాశాలలో, భద్రాద్రికొత్తగూడెం జిల్లాకు సంబంధించి ఇల్లెందు మున్సిపాలిటీలో ఉదయం 9–30 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఉద్యోగులు, పెన్షనర్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విధులకు భంగం కలిగించిన కేసులో ఆరు నెలల జైలు

ఖమ్మంలీగల్: పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ముదిగొండకు చెందిన ఇరుకు రమేశ్‌కు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ ఖమ్మం రెండో అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ఏపూరి బిందుప్రియ బుధవారం తీర్పు చెప్పారు. ముదిగొండలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎం.సుందరం 2017 జనవరి 1న గుంపును చెదరగొడుతుండగా రమేశ్ తదితరులు అడ్డుకున్నారు. అంతేకాకుండా కానిస్టేబుల్ చెంపపై రమేశ్ కొట్టగా ఆయన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. ఆపై విచారణలో ఆయనపై నేరం రుజువు కాగా జైలుశిక్ష విధించారు.

చెల్లని చెక్కు కేసుల్లో..

అప్పు చెల్లించే క్రమాన ఇచ్చిన చెక్కు చెల్లకపోవడంతో ఖమ్మం శ్రీసిటీ బారుగూడెంనకు చెందిన అల్లం దుర్గశ్రీకి మూడు నెలల జైలుశిక్ష, ఫిర్యాదికి రూ.6 లక్షల పరిహారం కింద చెల్లించాలని ఖమ్మం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి కాసరగడ్డ దీప బుధవారం తీర్పు చెప్పారు. ఖమ్మం నెహ్రూనగర్‌కు చెందిన నల్లపాటి వెంకటేశ్వరరావు వద్ద దుర్గశ్రీ 2016లో రూ.3 లక్షలు అప్పు తీసుకుని 2019లో రూ.5 లక్షలకు చెక్కు జారీచేశారు. ఖాతాలో నగదు లేక బౌన్స్ కావడంతో వెంకటేశ్వరరావు న్యాయవాది ఆనంచిన్ని రామారావు ద్వారా కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేశాడు. విచారణ అనంతరం న్యాయమూర్తి శిక్ష ఖరారు చేశారు. అలాగే, చెల్లని చెక్కు కేసులో కొణిజర్ల మండలం ధరావత్ రవికి సైతం మూడు నెలలు జైలుశిక్ష, ఫిర్యాదికి రూ.2లక్షల పరిహారం చెల్లించాలని ఖమ్మం ఒకటో అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారి బెక్కం రజని తీర్పు చెప్పారు. రఘునాథపాలెం మండలం ఈర్లపూడికి చెందిన బానోతు లాల్‌సింగ్ వద్ద 2013లో రూ.2 లక్షలు అప్పు తీసుకున్న రవి 2014లో చెక్కు జారీ చేశాడు. కానీ ఆ చెక్కు చెల్లకపోవడంతో ఆయన న్యాయవాది ద్వారా కోర్టును ఆశ్రయించాడు. ఈ మేరకు నేరం రుజువు కావడంతో రవికి శిక్ష విధిస్తూ తీర్పు వెలువడింది.

అప్పుల బాధ తాళలేక కౌలు రైతు ఆత్మహత్య

ఖమ్మంరూరల్: అప్పుల బాధ భరించలేక కౌలు రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఖమ్మంరూరల్ మండలం మంగళగూడెంనకు చెందిన బోనగిరి ఉప్పలయ్య (49) తనకున్న ఎకరంన్నరకు తోడు మరో నాలుగెకరాలు కౌలుకు తీసుకుని మిర్చి సాగు చేశాడు. అయితే, చీడపీడలతో ఆశించిన దిగుబడి రాక వచ్చిన కొద్దిపాటి పంటను మంగళవారం ఖమ్మం మార్కెట్‌లో అమ్మాడు. కానీ, వచ్చిన నగదు కౌలు, పెట్టుబడికే సరిపోకపోవడంతో మిగతా అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపంతో చేనులో చెట్టుకు ఉరి వేసుకున్నాడు. స్థానికులు గమనించి కుటుంబీకులు సమాచారం ఇచ్చారు. ఉప్పలయ్య భార్య ఉపేంద్ర ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ ముష్క రాజు తెలిపారు.

నేడు బార్ అసోసియేషన్ ఎన్నికలు

ఖమ్మంలీగల్: ఖమ్మం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు గురువారం పోలింగ్ నిర్వహించనున్నారు. మొత్తం 816 మంది న్యాయవాదులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందుకోసం జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ హాల్‌లో పోలింగ్‌కు ఏర్పాట్లు చేశారు. గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించి, ఆ వెంటనే ఓట్లు లెక్కించి ఫలితాలు వెల్లడిస్తామని ఎన్నికల అధికారులు తెలిపారు. కాగా, ఓటర్లు తమ గుర్తింపు కార్డుతో హాజరుకావాలని సూచించారు. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు హోరాహోరీగా ప్రచారం నిర్వహిస్తున్నారు. అధ్యక్ష పదవికి సుగ్గల వెంకటేశ్వరరావుగుప్తా, తొండపు వెంకటేశ్వరరావు, అయ్యదేవర విజయరాఘవ నడుమ త్రిముఖ పోటీ నెలకొంది. ఇక ఉపాధ్యక్ష పదవికి ఎస్‌కే జానీమియా, మల్లెం రవిప్రసాద్, మోతుకూరి విజయశాంతి, ప్రధాన కార్యదర్శి పదవికి గద్దల దిలీప్‌కుమార్, తెల్లాకుల రమేశ్‌బాబు, గ్రంథాలయ కార్యదర్శి పదవికి దేవరకొండ కల్యాణి, సింగారపు రాంబాబు, క్రీడా కార్యదర్శి పదవికి కేవీపీ లక్ష్మి, ధరావత్ రాందాస్‌నాయక్ పోటీపడుతున్నారు.

ఓసీ, సీహెచ్‌పీల్లో సింగరేణి డైరెక్టర్ తనిఖీ



సీహెచ్‌పీ వద్ద పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్లు, అధికారులు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం కిష్టారం లోని ఓసీ, జేవీఆర్ సీహెచ్‌పీలను సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్టు, ప్లానింగ్) కొప్పుల వెంకటేశ్వర్లు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓసీల్లో పని స్థలాలను పరిశీలించిన ఆయన బ్లాస్టింగ్ సమయాన దుమ్ము, ధూళి అరికట్టే చర్యలపై ఆరా తీశారు. అనంతరం సీహెచ్‌పీ, సైలో బంకర్ చుట్టూ బ్యారియర్ ఎత్తు పెంచాలని, మొక్కలు నాటాలని సూచించారు. ఆ తర్వాత జీఎం కార్యాలయంలో కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ షాలెంరాజు తదితరులతో సమావేశమై వివిధ అంశాలపై డైరెక్టర్ సమీక్షించారు. పీఓలు ఎం.నర్సింహారావు, ప్రహ్లాద్, సీహెచ్‌పీ ఇన్‌చార్జ్ సోమశేఖర్, వివిధ విభాగాల అధికారులు కోటిరెడ్డి, సత్యనారాయణ, రామకృష్ణ, గోపీకిషోర్, బాబు, డి.శ్రీనివాస్, విజయ్‌సందీప్ అధికారులు పాల్గొన్నారు.

ఓసీలో అత్యధిక ఉత్పత్తి

సత్తుపల్లి మండలం కిష్టారం ఓసీలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను ఈ నెల 24న 12,814,660 టన్నుల బొగ్గు ఉత్పత్తితో రికార్డు నమోదైందని పీఓ ఎం.వీ.నర్సింహారావు తెలిపారు.బుధవారం జీఎం షాలెంరాజు అత్యధిక బొగ్గు ఉత్పత్తి సాధించడానికి కారకులైన ఉద్యోగులు, కార్మికులను అభినందించారు. కిష్టారం పీఓ నర్సింహారావు, మేనేజర్ రామకృష్ణ, ఇంజనీర్ మాధవరావు, రక్షణ అధికారి గోపికిషోర్‌తో పాటు భరణి, ఆఫ్రోజ్, సందీప్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కొత్త పార్ట్ ఇవ్వండి లేదా పరిహారం చెల్లించండి

ఖమ్మంలీగల్: సాగులో ఉపయోగానికి కొనుగోలు చేసిన పరికరం పనిచేయక నష్టపోయినట్లు ఓ రైతు ఖమ్మంలోని జిల్లా వినియోగదారుల ఫోరంను ఆశ్రయించగా.. కొత్తది ఇవ్వాలని, లేనిపక్షంలో పరిహారం చెల్లించాలంటూ ఫోరమ్ మెంబర్లు వి.మాధవీలత, వి.లలిత బుధవారం తీర్పు వెలువరించారు. తల్లాడ మండలం పాత మిట్టపల్లికి చెందిన రైతు మువ్వా కృష్ణార్జునరావు పొలానికి పురుగుల మందు పిచికారీ కోసం ట్రాక్టర్‌కు బిగించేలా 2024 జులై 1న 500 లీటర్ల ట్యాంక్‌ను రూ.70 వేలకు కొనుగోలు చేశాడు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుర్తి తిలక్‌నగర్‌లోని సిగ్నటరీ ఎస్ఎస్‌కే కంపెనీ డీలర్ వద్ద దీన్ని కొనుగోలు చేయగా, సరిగా పనిచేయకపోవడంతో కంపెనీ బాధ్యులను సంప్రదిస్తే మరమ్మతు చేయించారు. అయినా ఫలితం లేక తాను నష్టపోయాయనని న్యాయవాదులు మువ్వా నాగేశ్వరరావు, తెల్లాకుల రమేశ్‌బాబు ద్వారా రైతు ఖమ్మం వినియోగదారుల ఫోరంలో కేసు దాఖలు చేశాడు. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం రైతుకు కొత్త ట్యాంక్ ఇవ్వాలని, లేనిపక్షంలో దాని ఖరీదు రూ.70 వేలను ఏడు శాతం వడ్డీతో సహా చెల్లించడమే కాక ఖర్చుల కింద రూ.10 వేలు, నష్టపరిహారం రూ.10 వేలు చెల్లించాలని తీర్పు ఇచ్చారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

చింతకాని: మండలంలోని చిన్నమండవ మున్నేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు బుధవారం సీజ్ చేశారు. జగన్నాథపురం సమీపాన చేపట్టిన తనిఖీల్లో ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేశామని ఎస్ఐ నాగుల్‌మీరా తెలిపారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

